
# కండీషన్స్

ఎలికట్టె శంకర్‌రావు



**''ముడ్డికిందికి ముప్పయ్యారేండ్లు వొచ్చినయ్. నీకా ఉద్యోగమొచ్చే యోగంలేదు. ఇంకా ఆ పోరంబోకు తిరుగుడు తిరిగే బదులు యల్ఐసి ఏజెంటుగ నన్న చేయరాదురా?'' యల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసరుగా పనిచేస్తున్న దోస్తు సత్తిరెడ్డి అనే సరికి గుండెల్లో రాయిబడ్డట్టయ్యింది.**

''కనబడ్డోనికల్లా వొంగొంగి దండాలు పెట్టాలె. యెవనెవని దగ్గరికో పోవాలె, కాకా పట్టాలె, నాతోని అయితాదిర? ఉన్న నాలుగెకరాలు సూసుకుంటె సరిపోదా?'' తెలిసిన ఏజెంట్లు పడుతున్న తిప్పల్ని తల్సుకొని అన్న.

అప్పుడే చాయ్ తీసుకొచ్చిన మా ఇంటామె ''యింట్లె జోరుగ ముచ్చెట్లు పెడ్తవ్‌గా? రాత్రి లేటుగొచ్చినప్పుడల్ల వో కత చెపుతవ్‌గా? ఆ తెలివేదో బెయట సూపిస్తె నాలుగు రాల్లు చేతుల బడ్తయ్ గా?'' సందు దొరికింది గదా అని దెప్పి పొడిసింది.

నాకు ముందు నుయ్యి యెనక గొయ్యోలిగ అయ్యింది. చాయ్ తాగుకుంట ఆలోచనలో బడ్డ.

''నాలుగేండ్లు కస్టపడ్డవంటె తక్కువల నెలకో నెలకో మూడువేలన్న సంపాయించ గలుగుతావ్. బేకారు తిరుగుడు తిరగకురా!'' సత్తిరెడ్డి ముంగలపొంటి బతుకుదెరువును గూడా సూపిచ్చిండు.

ఇటు దోస్తు అటు ఇంటామె. నిజానికి పరిస్థితి కూడా అందుకు విరుద్ధంగా లేదు.

''సరే'' అన్న.

అంతే మూన్నెల్లల్లో యల్ ఐసి ఏజెంట్ నయిన. ఇంతకు ముందు యేనా కొడుకుతోని మనకేం పని అనేటట్లు తల పొగరుతో తిరిగెటోన్ని రోజుకు వొంద నమస్తేల దాంక పెడుతున్న. పెదవుల మీద నవ్వు చెదరకుంట జాగర్త పడుతున్న. సుట్టాలను, దోస్తులను, తెలిసినోల్లను, పలకరించినోల్లను...యెవల్ని వొదలకుంట పొద్దున్నే పోయి పక్కమీదనే దొరికిచ్చుకుంటున్న. అరగంటో గంటో కలల గూడా ఊయించలేని కష్టాలను కండ్లముంగల సూపిచ్చి సంతకాలు పెట్టిచ్చుకుంటున్న.

ఆర్నెల్లల్ల ఏజెంటు బుద్దులు సొంతం అబ్బినయ్. రాత్రి పండుకునేటప్పుడు కూడా పరిచయాలు సొంతం మెదల్ల స్క్రీన్ మీద కదులుతుంటె వెంటనే రాస్కుంటున్న. పొద్దున్నే లేసి డైరీ సూసుకొని తెల్లారక ముందే బెయట పడుతున్న.

అట్లాంటి వో మాపు యెవల్ని కలవాలె అని ఆలోచించుకుంట డైరీ పేజీలను తిప్పేస్తుంటె అన్నీ కలిసిన వాల్లపేర్లే. కొన్ని దొరకని వాల్ల పేర్లు. ఆ పేర్లల్లో సూస్తుంటె వో పేరు దగ్గెర ఆగిపోయిన.

ఈ పిలగాడు యాడుండో?

***

పీటర్..

సరిగ్గా నాలుగేండ్ల కింద తారసపడ్డడు. పాన్ డబ్బకాడ దమ్ముకొట్టుకుంట నిలబడితె ''సార్ యెలక్ట్రానిక్ అయిటమ్స్ సార్'' అనుకుంట వొచ్చిండు.

సూడబుద్దయ్యే రూపం. మంచి ఎత్తు. రంగు. చేతిలో ఆరతి పల్లెమోలిగ వో ప్లాస్టిక్ ప్లేటు. దాన్నిండ చిన్న చిన్న యెలక్ట్రానిక్ గూడ్స్, వాచ్, అలారం పీస్, రిమోట్‌గార్డ్ పెద్ద సూపర్ మార్కెటోలిగుంది. మెడకున్న సంచి పొట్ట యెలక్ట్రానిక్ గూడ్స్‌తో వుబ్బిపోయి ఉంది.

''సార్ యేదైనా నలభై రూపాలే సార్. గ్యారంటీ అయిటం సార్'' వొక్కొక్క వొస్తువు గురించి చెబుతుండు.

దమ్ము గుంజుకుంటనే అన్ని వొస్తువులను గమనించిన. ఇదేంది? ఇదెంత? అని అడిగిన. ఆ పిలగాని మొకం సూసి ఏదన్న కొనాలనిపించింది.

''సింగ్ రిమోట్ గార్డొకటి, అలారం పీసొకటి యియ్యి'' అన్న.

''సార్ నా పేరు పీటర్'' అన్నడు ఆ పిలగాడు.

''పీటర్? నీ గడ్డం, జుట్టు ముడేసిన తీరు సూసి సిక్కువనుకున్న''

పీటర్ కొక చేత్తో నెత్తిమీద గుడ్డను సరిచేసుకంట సన్నగా నవ్విండు. అడిగిన అయిటమ్స్ తీసి నా చేతుల పెట్టిండు. పైసలిచ్చుకుంట ''ఏం సదువుకున్నవ్ పీటర్'' అడిగిన.

''డిగ్రీ సెకండియర్ సార్'' బుద్ధిగా చెప్పి ముందుకు కదిలిండు.

పెద్ద పెద్ద సదువులు సదువుకొని వుజ్యోగం లేదనే నా కొడుకులకు యీ పీటర్‌ను సూపిస్తెనన్న బుద్దొస్తదేమో అనుకున్న. ఎవలో జాడిచ్చి చెంప మీద కొట్టినట్టయ్యింది.

***

పీటర్ శానా సార్లు కలిసిండు. యెంతో యిదిగా పలకరిస్తుండు. అవసరాన్ని బట్టి ఏదో వొస్తువును కొంటనే వున్న.

ఓనాడు పొద్దూకంతల చాయ్ తాగాలనిపించింది. ఒంటరిగ తాగటమంటె కష్టమే. ఎవలన్నా కలుస్తరేమో అని సూస్తుంటె పీటర్ నవ్వుకుంట సైకిల్ మీదొచ్చి ఆగిండు. ''నమస్తే అన్నా'' అని పలకరించిండు. చనువు పెరిగినంక యీ నడుమ అట్లనే విష్ చేస్తుండు.

''సింగ్ దా చాయ్ తాగుదాం'' పిలిసిన. సైకిల్ స్టాండేసి కేఫ్లకొచ్చిండు. చాయ్ తాగుకుంట ''పీటర్ నువ్వేమి అనుకోకు. నిన్ను సింగ్ అనే పిలుస్త'' అని నవ్వుకుంట అన్న.

''యెట్ల పిలస్తె యేందన్నా! పావురం వుండాలె గని! నన్ను చాలా మంది... నా క్లాస్‌మెట్స్ కూడా సింగ్ అనే పిలుస్తరన్నా'' అన్నడు. బోలామనిషోలిగ అనిపించిండు.

''యేం సింగ్ వుత్త చేతుల్తో యెల్లినవ్?'' అడిగిన.

''లేదన్నా యేడు గంటల దాంక తిరుగుత. తరువాత బందు జేస్త''

''కాలేజికి పోతున్నవ్‌గా?''

''ఫైనలియరన్నా''

''బిజినెస్ యెట్లుంది?''

''బానెవుందన్న. కాలే జీకి సెలవులు దొరికితె అయ్యాల సొంతం తిరుగత. తతిమ్మ దినాలల్ల వో రొండు మూడు గంటలు తిరుగుత. లేకుంటె యెల్లదు గదన్నా!'' శిలువను మోస్తున్న యేసోలిగ నవ్విండు.

''మీ నాయినేం జేస్తడు సింగ్?'' ఇంకా తెలుసుకోవాలనిపించి అడిగిన.

''పోలీస్ డిపార్ట్‌మెంట్ల కానిస్టేబుల్‌గా రిటైర్ అయ్యిండన్నా. పెన్షన్‌మీద యిద్దరు తమ్ముడ్లు, చెల్లె, నేను, అమ్మా నాయిన... యింతమందిమి బతకాలంటే కస్టం కదన్నా. వూకోలేక సలినీల్లకు తోడువుడుకు నీళ్లోలిగ యేదో యీ పంజేస్తున్న''

కండ్లు తడిబారినయ్. ఇంత చిన్న వొయిసులో కుటుంబం గురించి ఆలోచించే సింగును సూస్తుంటె సంబూరమనిపించింది.

''జిమ్‌కు పోతవా సింగ్? బలే గట్టిగున్నవ్'' బలమైన కండలు సూసుకుంట అడిగిన.

''ఇంట్లనే చేస్తన్నా. అయినా నేను ఫుడ్‌బాల్ ప్లేయిర్‌ను గదన్నా!''

''అట్లనా?''

''అవునన్నా మొన్ననే నేషనల్స్‌కు సెలక్ట్ అయిన. వొచ్చే నెలల బెంగ్లూర్‌లో టోర్నమెంట్స్''

సిగరెట్ అంటించి ''నువ్వు జుట్టు ఎందుకు అట్ల పెంచినవ్?'' ఏదో తెలుసుకోవాలన్న యావతో అడిగిన పొగ వొదులుకుంట.

సింగ్ వొక్క నిమిషం చేతిని మొకం మీద పెట్టుకొని కండ్లు మూసుకుండు. తరువాత యేదో గుండె లోతుల్నుంచి వొచ్చినట్టుగా వొచ్చినయ్ మాటలు.


''అన్నా నేనే యస్సీ. పుట్టినప్పుడు నాకు పెట్టిన పేరు రాములు. మా నాయినకు డిపార్ట్‌మెంటులో, బతుకులో యెదురైన అవమానాలు, అనుభవాలు మాకు యెదురు కావొద్దని క్రైస్తవ మతం తీసుకున్నం. అప్పట సంది నా పేరుకు పీటర్ తొడయ్యింది. నా పూర్తి పేరు పీటర్ రాములు. ఇంక జుట్టంటావా? అవమానాలు తప్పించుకోవటానికి. నా కులం యెవలూ ఆలోచించకుంట సిక్కునన్న భ్రమతో నన్న నన్ను గౌరవంగా సూస్తరని. నాకు గడ్డం మీసాలు వొచ్చిన సంది రేజరుపత్తి పెట్టలే''

***

ఆ తరువాత పీటర్ యెక్కువగా బెయట కనపడలే. ఓసారి అడావుడిగా సైకిల్ మీద పోతూ ''నమస్తే అన్నా'' అని పలకరించిండు. ''యేం సింగ్ కనిపించట్లేదు'' అనడిగితే ''ఫైనల్ ఇయర్ ఎక్సామ్స్ కదన్నా సదవుతున్న'' అని చెప్పిండు.

దాదాపు వో యేడాది కావొచ్చు. యాడ వుంటుండో, యేం జేస్తుండో తెల్వదు. అప్పుడప్పుడు యాదికొస్తుంటడు గని సింగ్ గురించి చెప్పేవాల్లు యెవలూ లేరు.

బస్టాండుకు పోదామని ఆటో కోసం ఎదురుజూస్కుంట రోడ్డుమీద నిలబడ్డ. డిప్పకటింగు, కొద్దిగా పైకి లేసిన మీసంతో వో పడ్సుపిలగాడు మోటర్ సైకిల్ మీదొచ్చి పక్కన్నే ఆపిండు. యెవలా అని ఆనవాల్లకోసం సూసిన. ఆ వొచ్చిన మనిషి బండిదిగి దగ్గరకు వొచ్చి కండ్లతో నవ్వుకుంట ''అన్నా నన్ను గుర్తుపట్టలేదా?'' అడిగిండు. పోల్సుకోలేక పోయిన. ఇంకా యిబ్బంది పెట్టొద్దనుకుండేమో ''నేనన్నా సింగును'' అన్నడు. ''యెక్కడ బోయినవయా? పత్తా లేదు'' భుజం మీద చెయ్యేసి అడిగిన.




''అన్నా! డిగ్రీ ఎక్జామ్స్ రాయగానే పోలిస్ డిపార్ట్‌మెంట్ల రిక్రూట్ మెంటు నోటిఫికేషన్ బడ్డది. అప్లైజేసిన. కానిస్టేబుల్‌గా సెలక్ట్ అయిన. కర్నూల్లో ట్రైనింగ్‌లో వున్న'' నవ్వుతూ చెప్పిండు.

నేను సంబూరపడ్డ. ''సరే యేదో వోటి. యెస్సైకి తరువాత ట్రై చెయ్యొచ్చులే'' అన్న.

''ఎటన్నా పొద్దున్నే బయల్దేరిండ్రు?'' అడిగిండు సింగ్.

''అయిద్రాబాదు...బస్టాండుకు పోదామని''

''రా అన్నా డ్రాప్ చేస్త''

మోటార్ సైకిల్ ఎనక కూసున్న నాకు సింగు జుట్టుమీదనే మనసుంది. ఎంత యిదిగా పెంచుకుండు పిలగాడు?

''సింగ్ జుట్టు తీసేసినవ్?''

''నేను నిజంగా సిక్కును కాదని సర్టిఫికెట్లు చూసినోల్లకు తెల్వదా అన్నా? వొంగబెట్టి కత్తిరిచ్చిండ్రు''

''బానే వొప్పుకున్నవ్?''

''జుట్టు బువ్వ బెడ్తదా అన్నా? కొలువు ముఖ్యం గదా! ఇష్టం వున్నా లేకున్నా తీసెయ్యాలె'' బస్టాండ్ ముందు ఆగింది బండి.

''సింగ్ మీ యిల్లెక్కడ?''

''పాతబస్తీ అన్నా సంటర్ కొచ్చి యెవల్నడిగినా చెపుతరు''

''ఆఁ సింగ్ వుజ్యోగం వొచ్చింది గదా! ఇంకేంది లేటుపెండ్లికి?''

సింగు సప్పుడుగాకుంట నవ్విండు.

''సూడమంటవా పిల్లను?''

''వొద్దన్నా'' అనుకుంట ముసి ముసిగా నవ్విండు సింగ్.

''యేంది సంగతి లవ్వా?''

సింగ్ సిగ్గుపడ్డడు. కొంత సేపటి వరకు అవునని కానీ, కాదని కానీ అనలే. తర్వాత అవును అన్నట్టుగా కండ్లు మూసుకొని తలాడించిండు.

''యెప్పుడు చెప్పలేదు? యెవలా అమ్మాయి?''

''ఇప్పుడు యెందుకు లే అన్నా! పత్రిక చేతుల పెట్టి చెవుత'' సింగు చెప్పటానికి ఇష్టం లేదన్నట్టు దాటేసిండు.

''ఓ.కే బెస్ట్ ఆఫ్ లక్'' అని బస్సు దిక్కు కదిలిన.

***

ఆర్నెల్ల తరువాత సింగ్ కనిపించి ''నార్కట్‌పల్లి పోస్టింగు ఇచ్చిండ్రన్నా అని సంబూరంగా చెప్పిండు.

పెండ్లి పెడాకులు లేనోల్లంటె అన్ని మావు దూటీలే నన్నా. దగ్గరుండి కూడా యెవల్ని కల్వలేక పోతున్న'' అన్నడు కొద్దిగ బాధగ.

ఆర్నెల్లు అయినట్టుంది సింగు మల్ల కల్వలె. ఈ సందుల్నె యల్ ఐసి ఏజెంటు నైన.

పొద్దున్నే లేసి సక్కగ పాతబస్తీకి పోయిన. పీటర్‌ను యెట్లన్న దొరికిచ్చుకొని వో పాలసీ అంట గట్టాలని. ఇద్దరు ముగ్గుర్ని అడిగిన తరువాత యిల్లు దొరికిచ్చుకున్న. చిన్న యిల్లు. పేదరికం కనబడుతుంది. ఇంట్లె వో పెద్దమనిషి మంచం మీద కూసుండు. నన్ను సూడంగనే లేసి రాబోయిండు. ముసలితనమో, యిసం నీల్లో కాల్లుసరిగ్గా ఆడ్తలేవు.

''పీటర్ వున్నాడండి?'' అడిగిన.

పీటర్ తండ్రి అనుకంట. పరేశాన్‌గ అనిపిచ్చిండు. పీటర్ పేరు అడగ్గానే సత్తువ గుంజుకున్నట్టు గయ్యిండు.

''పొద్దున్నే పోయిండు నాయనా'' గొంతులో బాధ తొణుకు తుంటె అన్నడు.

''డ్యూటీకి పోయిండా? ఎప్పుడొస్తడో చెప్పగలరా?''

పెద్దమనిషి సప్పుడు చెయ్యలేదు. యేదో మనాది గుండెల్ను పిండుతున్నట్టుగా వుండు. నాకు ఇబ్బందిగా అనిపించింది. యేదో జరిగినట్టుంది అని మనసులో అనుకొని నా పేరు చెప్పి ''పీటర్‌కు చెప్పండి'' అని బెయట పడ్డ.

నా మనసంతా పీటరే. ఏమయ్యుంటది? యెందుకు ఆ పెద్దమనిషి అంత బాధపడుతుండు? చిన్న వొయిసులో కొడుక్కు వుజ్యోగమొచ్చింది. తల్లిదండ్రులు ఎంత సంబురపడాలె? యేం జరిగిందో? మనసంత చికాకు అయితుంటె పాత కలెక్టరాఫీస్ సందుగుండ వొస్తున్న. పొద్దుగల్ల ఆరున్నర అయ్యిందో లేదో మందు షాపు అప్పుడే తీస్తుండ్రు. ఆ షాపు గురించి మా సత్తిరెడ్డిగాడన్న మాట యాది కొచ్చింది.

''ఈ నా కొడుకు మీద మర్డరు కేసు పెట్టి లోపల తోయాల్రా. అర్ధమ్మ రేత్రి దాకా తీసే ఉంచుతడు. పొద్దున్నే చాయ్ హోటల్లు, కిరాణ దుకాణాలు తీయకముందే తీస్తడు. ఈ లంజెకొడుకు దుకానంల తాగి యెంతమంది సచ్చింర్రో? యెంత మంది పెండ్లాలు ముండమోసిండ్రో?''

''సర్కారోన్ని అనాల్సిన మాట యిన్నంటె యేం లాభంరా?'' సత్తిరెడ్డిగాని మాటకు అడ్డుబోయిన.

తాళ్ళోని దుకాణం ముంగల నలుగురయిదుగురు యెప్పుడు దుకానం తీస్తరా యెప్పుడు యింత మింగాల్నా అని యెదురు సూస్కుంట నిటబడటం కంట బడ్డది.

తాగుబోతు నా కొడుకులు మాపటీలు ఇంటికన్న పోతరో పోరో? ఇంట్లె పెండ్లం పిల్లలు చాయ్ బొట్టన్న తాగింర్రో లేదో? అప్పుడే యీడ తేలిండ్రు అని అసహ్యించుకుంట ఆ మనషుల మొకాల దిక్కు సూసిన.

ఒక్కసారిగా బండి బ్రేకుపడి ఆగింది.

అవును ఆ పిలగాడే..

జుట్టు, గడ్డం, పీక్కపోయిన చెంపలు...మాసిపోయిన బట్టలు పీటర్. యేమయ్యింది యీ పిలగానికి? పచ్చి తాగుబోతోనోలిగ యింత పొద్దుగల్ల. ఆ అవతారమేంది? వొక్కసారిగా గుండెలు పిసికినట్టయింది.

ఇంతలో వో బాటిల్ కొనుక్కొని నలిగిపోయిన ప్యాంటు జేబులో పెట్టుకొని వొస్తుండు పీటర్. దగ్గెరకు రాంగనె ''సింగ్'' అని పలకరించిన. పీటర్ నీరసంగ వో సూపు సూసిండు. నాకు యేదేదో అడగాలనిపించింది. నాలుగు దులపాలనిపించింది. కాని యేమనగలను? ఆక్రోశాన్ని దిగమింగి ''యెటు సింగ్?'' అన్న.

పీటర్ యేం మాట్లాడలేదు. పీటర్‌తో పాటు మందు కొనుక్కున్నోల్లు పక్కన్నే వున్న హోటల్‌లోకి పోతుండ్రు. పీటర్ కూడా అక్కడికే పోతడని అర్ధమయ్యింది.

''చలో హోటల్‌కు పోదాం పా'' బండి పక్కకు పెట్టి హోటల్‌కు బాటతీసిన.

మూలకు వో టేబుల్ సూసుకొని రొండు ప్లేట్ల యిడ్లీలకు ఆర్డరిచ్చిన. హోటల్ పిలగాడు మంచినీల్ల




గ్లాసులతో పాటు రొండు ఖాలీ గ్లాసులు తెచ్చి పెట్టిండు. అక్కడ అన్ని టేబుల్ల మీద అదే పరిస్థితి. ఇడ్లీలు తినుకుంట విస్కీ తాగుతుండ్రు. ''భగవంతుడా వీల్లను కాపాడు'' మనసులో కనిపించని దేవున్ని వేడుకున్న.

పీటర్ ఎన్క ముందాడుతుంటె ''తీసుకో సింగ్'' అన్న.

సీస మూత తీసి గ్లాసులో పోసుకుండు. రప్ప రప్ప మింగిండు. పీటర్ మొకంలో పానమొచ్చినట్టయింది.

''యేమయ్యింది సింగ్?'' యిడ్లీలు తినుకుంట నిమ్మలంగ అడిగిన.

పీటర్ తటపడాయించిండు.

''ఇంట్లె యిబ్బందా?'' మాటల్లోకి దించాలని అడిగిన.

మల్లో రౌండు కొట్టిన పీటర్ నోరు తెర్సిండు.

''అన్నా రాములు హిందువు కాడు. పీటర్ తగిలించు కున్నా క్రిస్టియన్ కాడు. జుట్టు పెంచుకున్నా సిక్కు కాడు''

''యేం జరిగింది పీటర్?''

''నా క్లాస్‌మేటన్నా. స్పోర్ట్స్‌మెన్‌గా నా చెలాకితనం తనకు నచ్చిందని చెప్పింది. ఇష్టపడుతున్నని చెప్పింది. నేను ఇష్టపడకుంట వుండలేకపోయిన. పెండ్లి జేసుకుందామనుకున్నం. ముందుగా ఉజ్యోగం సంపాయించు తర్వాత మా వోళ్లకు చెపుతా అని నమ్మకంగ చెప్పింది.''

''నేను ఉజ్యోగం సంపాయించిన ఆ అమ్మాయిని కల్సిన. అప్పటికే వాల్ల నాయినతో చెప్పిందట. అయిన తోకతొక్కిన తాసోలిగ లేసిండట. బిడ్డ మొండితనం సూసి తిప్పుకొని ''వోసారి ఆ పిలగాన్ని తీస్కరా మాట్లాడదాం'' అన్నడట.

''ఆ అమ్మాయి నాతో చెప్పితె-నేను యెన్క ముందాడిన. తర్వాత ధైర్యం తెచ్చుకొని వాల్లింటికి పోయిన. వాల్ల నాయిన చికాగ్గా అనిపించిండు నా కుటుంబం గురించి, నా గురించి గుచ్చిగుచ్చి అడిగిండు''

''మీ అమ్మానాయినల వొదిలిపెట్టి రాగలవా'' అన్నడు నేను సడీసప్పుడు చెయలే. హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయితుంది నువ్వు కూడ అక్కడికే రావాలె నీ కులపోల్లకు దూరంగా ఉంటనంటె-అప్పుడు ఆలోచిస్త'' అన్నడు.

పీటర్ చెపుతుంటె ''నువ్వేమన్నవ్'' అదాట్న అడిగిన పీటర్‌లో ఏదో కొత్త మొకం కనిపించింది.

''నేను లేసొచ్చిన. ఆ లంజకొడుకు మొక్కను వేర్లను దూరం చేయలనుకుండన్నా'' పీటర్ గొంతులో దుక్కం, కసి-

నా మనసులో ఏదో సంఘటన లీలగా మొదుల్తుంటె ''ఆ పిల్ల పేరు?'' అన్న నా గొంతులో మార్పు నాకే అదోతీర్గ వినిపించింది.

''సుశీల'' అన్నడు.

కాదు-కాకూడదు అని నా మనసు కొట్టుకుంటుంటె,

''వాల్ల నాయిన భాస్కర్‌రావు రెవెన్యూ డిపార్ట్‌మెంట్ల ఉజ్యోగం'' అన్నడు పీటర్.

నా వొంట్లె ఒక్కసారిగా ఆవిర్లు చిమ్మినయ్. నా గుండె వేగంగ లబ్‌డబ్ అని కొట్టుకుంటుంటె నాకే విక్రతంగా అనిపించింది.

మేము తిరుపతి పోయినపుడు నా మేనకోడలు సుశీల గురించి ఏదో జరిగిందని మా ఇంటామె చెప్పింది. మా అక్కబావ వొద్దనుకుండ్రేమో నాకు చెప్పలేదు.

అంటె ఈ లంజకొడుకు...పీటర్ బాగోతం నా కోడలుతో నన్నమాట. నా దవడ కండరాలు బిగుసుకున్నయ్. తన్నుకొచ్చే ఆవేశాన్ని అనుచుకుంటుంటె,

''ఇంకా ఎన్నేండ్లకు మాదిగోన్ని తోటి మనిషిగా సూస్తరన్నా'' అన్నడు పీటర్. గొంతు దుక్కంతో పూడుకుపోతుంటె గ్లాసందుకుండు.

నాకు వొక్కసారిగా పూనకం వొచ్చినట్టయింది. లేసి పీటర్ ముక్కు మీద ఒక్కటి గుద్దిన. పీటర్‌తో పాటు గ్లాసు కిందపడి భల్లున పగిలింది దాంతో పాటు పీటర్ ముక్కు.....

వొల్లంతా బొచ్చుపురుగు మీద బడ్డట్టయ్ విసురుగా బెయిటికొస్తూ యెన్కకు మల్లి చూసిన.

నెత్తురోడుతున్న ముక్కుల గుండా ఊపిరి తీసుకుంటూ పీటర్ లేవటానికి ప్రయత్నం చేస్తుండు.

★